అన్ని వర్గాల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి కృషి


గాజుల అంజయ్య

చార్మినార్: అన్ని వర్గాల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి కృషి చేస్తారని మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఈనెల 7న ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా గాజుల అంజయ్య శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ ,మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలందరూ సుఖ సంతోషాలతో చల్లంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

రేవంత్‌రెడ్డి హయాంలోనే బంగారు తెలంగాణ



అబిడ్స్: నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిసి మెట్టు సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డితోనే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. దొరలపాలన అంతమై ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు.

పాతబస్తీలో కారుకు పంక్చర్

- ఎన్నికల్లో ప్రభావం చూపని బీఆర్ఎస్..
- నాయకత్వాన్ని పటిష్టం చేయాలంటున్న సీనియర్లు
- ఎన్నికల వేళ పట్టించుకోని పార్టీ అధిష్టానం
- నిరుత్సాహంలో పాతబస్తీ నాయకులు, కార్యకర్తలు



చార్మినార్: గ్రేటర్‌లో స్పీడ్‌గా దూసుకుపోయిన కారు.. పాతబస్తీలో మొరాయించింది. పాతబస్తీలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో కారు స్పీడ్ పెంచలేక మొండికేసింది. ఈ ఎన్నికల్లో కారు గమ్యాన్ని చేరుకోలేక పోయింది. గ్రేటర్‌లో చాలా వరకు బీఆర్ఎస్ అభ్యర్థులు తమ స్థానాలను కాపాడుకుని భారీ మెజార్టీతో విజయం సాధించి ఈ నగరం మాదే అన్నట్లు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ అభ్యర్థులను వెనక్కి నెట్టివేసిన విషయం తెలిసిందే. ఇక పాతబస్తీలో బీఆర్ఎస్ అభ్యర్థుల ఫలితాలను పక్కన పెడితే.. కనీసం తమ ఉనికిని కాపాడుకోలేక పోయారు. ఈ ఎన్నికల్లో పాతబస్తీలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులు తమ డిపాజిట్లను సైతం దక్కించుకో లేకపోయారు.

పటిష్టమైన నాయకత్వం లేకపోవడమే..

- పాతబస్తీలోని యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, చార్మినార్ తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి పటిష్టమైన నాయకత్వం లేదు. చార్మినార్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో పూర్తిస్థాయి కార్యవర్గం ఉంది. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు బలంగా ఉన్నప్పటికీ..ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ వీరిని పక్కన పెట్టారు. ఎన్నికల ప్రచారంలో వీరెవరు ఆయనతో కలిసి ప్రచారం నిర్వహించ లేదు. చార్మినార్‌లో గ్రూపు తగాదాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక మిగిలిన మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికీ డివిజన్ల వారీగా కార్యవర్గం లేదు. సరైన నాయకత్వం లేకపోవడంతో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఆశించిన స్థాయిలో ప్రచారం చేయలేదు. అంతేకాకుండా టికెట్ల కేటాయింపులో సరైన దృష్టిసారించకపోవడంతో పాతబస్తీలో కారు చతికిలబడింది. నగరంలో వేగంగా వెళ్లి భారీ మెజార్టీ సాధించిన కారు పాతబస్తీలో పంక్చర్ అయ్యింది.. కేవలం బలమైన నాయకత్వం లేకపోవడమేనని అంటున్నారు.

రెండో సారి టికెట్ల కేటాయింపుతో..

- టికెట్లు కేటాయింపులో పార్టీ అధిష్టానం వ్యవహరించిన తీరు స్థానిక నాయకులను నిరుత్సాహానికి గురిచేసింది. టికెట్లను ఆశించిన స్థానిక నాయకులకు కాకుండా 2018 ఎన్నికలలో పోటీ చేసిన వారికే మళ్లీ టికెట్లు కేటాయించడంతో ఇక్కడి నాయకులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. చార్మినార్‌లో చాలా మంది సీనియర్ బీఆర్ఎస్ నాయకులు టికెట్లు ఆశించి బంగపడ్డారు. అలాగే సెట్విన్ మాజీ చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ మొదటి నుంచి చార్మినార్ టికెట్ ఆశించారు. ఆయనకు చార్మినార్ కాకుండా పార్టీ అధిష్టానం బహదూర్‌పురా నియోజకవర్గం నుంచి టికెట్ కేటాయించి ఎన్నికల బరిలోకి దింపింది. దీంతో మీర్ ఇనాయత్ అలీ బాక్రీ బహదూర్‌పురా నియోజకవర్గం ఓటర్లకు స్థానికేతరుడయ్యాడు. అలాగే యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి స్థానిక నాయకులకు కాకుండా నియోజకవర్గంలోని చివరి ప్రాంతమైన ఐఎస్ సదన్ డివిజన్‌కు చెందిన సామ సుందర్‌రెడ్డికి కేటాయించడంతో పాతబస్తీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగిన ముప్పిడి సీతారాంరెడ్డి ఈ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ప్రచారం నిర్వహించినప్పటికీ.. ఆయనకు ఈ ఎన్నికల్లో 18,116 ఓట్లు లభించడంతో డిపాజిట్ కాపాడు కోలేకపోయాడు. మొదటి నుంచి పార్టీ టికెట్లు ఆశించిన సీనియర్ నాయకులకు కాకుండా పాత వారికే మళ్లీ టికెట్లు కేటాయించడంతో పాతబస్తీలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు తమ గమ్యాన్ని చేరుకోలేకపోారు.

మజ్లిస్ అభ్యర్థుల ఓట్లతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థులు సాధించిన ఓట్లు..

- పాతబస్తీలోని నాలుగు నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు మొత్తం 2,66,228 ఓట్లు సాధించగా.. బీఆర్ఎస్ అభ్యర్థులు నలుగురికి కలిపి మొత్తం 64,340 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి.
- చార్మినార్ నియోజకవర్గంలో మజ్లిస్ అభ్యర్థికి 49101 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి 8853 ఓట్లతో నాలుగో స్థానానికి దిగజారిపోయి డిపాజిట్ కోల్పోయాడు.
- చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ అభ్యర్థికి 99,776 ఓట్లు పోలవ్వగా.. బీఆర్ఎస్ అభ్యర్థికి 18116 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచినప్పటికీ డిపాజిట్ కోల్పోయాడు.
- బహదూర్‌పురా నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ అభ్యర్థికి 89457 ఓట్లు పోలవ్వగా.. బీఆర్ఎస్ అభ్యర్థి 22246 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచినప్పటికీ డిపాజిట్ కాపాడుకోలేకపోయాడు.
- యాకుత్‌పురా నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ అభ్యర్థికి 46010 ఓట్లు పోలవ్వగా.. బీఆర్ఎస్ 15125 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచి డిపాజిట్ కాపాడుకోలేకపోయారు. ఇలా పాతబస్తీలోని కారు పార్టీ అభ్యర్థులు ఈ ఎన్నికల్లో తమ ప్రభావాన్ని చూపలేకపోయాయి.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం


తలసానిని సన్మానిస్తున్న కేసీ శేఖర్ తదితరులు

గోల్కొండ: మాజీ మంత్రి, మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తలసానిని సన్మానించారు. తలసాని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ తాము ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన అన్నారు.

రాజాసింగ్‌కు సన్మానం


ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు దేవర వంశీ

గోల్కొండ: గోషామహల్ ప్రజల ఆదరాభిమానాలను తాను ఏనాటికి మరువనని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. మూడవసారి గోషామహల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనను గుడిమల్కాపూర్ బీజేపీ నాయకులు మంగళవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. ప్రజల మద్దతు వల్లే తాను గెలిచానని గోషామహల్ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు. శ్రీకాంత్‌సాగర్, లక్ష్మీనారాయణ, ప్రభుపూజారి, నాగరాజు, అనిల్‌సాగర్ తదితరులున్నారు.

కార్వాన్‌లో చతికిలబడ్డ కాంగ్రెస్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి చతికిలబడింది. తెలంగాణలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నా కార్వాన్‌లో మాత్రం ఆ పార్టీలో ఉత్సాహం కొరవడింది. టికెట్ కేటాయింపు విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నా కాంగ్రెస్ అధిష్టానం పట్టించుకోకుండా కాంగ్రెస్ అధినాయకత్వం గత ఎన్నికల్లో పోటీ చేసిన ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీకి టికెట్ కేటాయించింది. ఆయన కార్వాన్ నాయకులను పట్టించుకోకుండా ఎన్నికల రంగంలో ఒంటరిగానే దిగారు. అన్నింటా తానై ఉండి ప్రచారం నిర్వహించారు. కాగా కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎవరు కూడా ప్రచారంలో పాల్గొనలేదు. ఇతర నాయకుల సహకారం కూడా కాంగ్రెస్ అభ్యర్థి కోరలేదు. కార్వాన్ నియోజవర్గంలో అత్యధిక ఓటర్లు ముస్లిం, మైనార్టీలే ఉండడం గమనార్హం. మజ్లిస్ మాత్రం మళ్లీ పాత కాపును రంగంలోకి దింపింది. అయితే పోటీ మాత్రం కాంగ్రెస్ ప్రత్యర్థులకు ఎటువంటి సవాల్ విసరలేదు. చివరికి కేవలం 14 వేల పైచిలుకు ఓట్లు మాత్రం కాంగ్రెస్ సాధించి పూర్తిగా చతికిలబడింది.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ



గోల్కొండ: విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రోత్సహించి వారి భవిష్యత్తును ఉజ్వలంగా మార్చేందుకు తమ పాఠశాల కృషి చేస్తుందని శ్రీ చైతన్య స్కూల్ మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంతరిక్ష విషయాలపై విద్యార్థులకు మరింత ఆసక్తి కలిగించేలా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నాసా కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్ఐ హరికృష్ణ, ప్రిన్సిపల్ స్వాతి, అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ ఓంకార్, అసిస్టెంట్ డీన్ ఆంజనేయులు, ఇన్‌చార్జి నదీమ్, నాసా ఇన్‌చార్జి ఏజాజ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


పూజల్లో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని శివ్‌బాగ్‌లోని పార్వతీ పరమేశ్వర స్వామి అలంకార పూజా కార్యక్రమం జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ పూజల్లో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, అర్వస్‌కుమార్, కట్టా నర్సింగ్‌రావు, శ్యామ్‌సుందర్, ప్రభుపూజారి, ఆలయ కమిటీ సభ్యులు రఘుగౌడ్ పాల్గొన్నారు.

సామూహిక దీపారాధన


రాహుల్ దాస్‌బాబాకు దీపం దానం చేస్తున్న భక్తులు

లంగర్‌హౌస్: శివనామస్మరణతో త్రివేణి సంగం ప్రాంతం పరవశించింది. కార్తీక సోమవారం పురస్కరించుకొని లంగర్‌హౌస్ సంగంలోని జానకీసమేత వీరవెంకట విజయరాఘవస్వామి ఆలయంలో సామూహిక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పండితులు శ్రీనివాస్, రింకు శాస్త్రి దీపారాధన చేయించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఉసిరి కాయపై దీపాలు వెలిగించారు. ఆకాశ దీపం అనంతరం భక్తులు కార్తీక దీపాలను వెలిగించి రాహుల్‌దాస్ బాబాతో పాటు పూజారులకు దీపాలు దానం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లి లోని స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్ కట్ట ప్రాంతానికి చెందిన ఓబైద్ బిన్ సలాం (43) ఈనెల 3న ఎన్నికల ఫలితాల సందర్భంగా స్థానికంగా సౌండ్ బాక్సులు పెట్టి న్యూసెన్స్ సృష్టించాడు. పోలీసులు సౌండ్ బాక్స్‌లను ఆపాలని సూచించడంతో దురుసుగా మాట్లాడి వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు ఓబైద్ బిన్ సలాం అరెస్టు చేసి మంగళవారం నాంపల్లిలోని నాలుగో స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా..మెజిస్ట్రేట్ సత్యనారాయణ నిందితునికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు ఓబైద్ బిన్ సలాంను చంచలగూడ జైలుకు తరలించారు.

గోల్కొండ ఆస్పత్రి అభివృద్ధికి కృషి


కౌసర్‌ను సన్మానిస్తున్న గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్య బృందం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్య బృందం మంగళవారం ఆయనను సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా తాను ఎమ్మెల్యేగా ఉన్నానని ఆస్పత్రికి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు అధికారుల సహకారంతో ఎంతగానో అభివృద్ధి చేయించానన్నారు. ఆస్పత్రి నూతన బ్లాక్ నిర్మాణానికి గత ప్రభుత్వ ఆరోగ్య మంత్రి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించారని ఆ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. రానున్న ఐదేళ్లల్లో అందరికీ అందుబాటులో ఉంటూ మరింత నిబద్ధతతో ప్రజా సేవా చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మహజర్‌ఉల్లా, ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు చేస్తున్న వైద్యులు

సుల్తాన్‌బజార్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. ప్రతిమ హాస్పిటల్, బజరంగ్‌సేన సంయుక్త ఆధ్వర్యంలో కోఠి బ్యాంక్ స్ట్రీట్ వద్ద మంగళవారం గాంధీ పార్కులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రజల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు ప్రతిరోజూ నడక, చిన్నపాటి వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారని ఆయన తెలిపారు. వైద్య శిబిరాల ద్వారా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించుకుని వారికి కావాల్సిన మందులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు విజయ్ రమేష్ భాస్కర్‌రెడ్డి పాండేతో పాటు వైద్యులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

సాంబశివరావుకు ప్రతిభా పురస్కారం ప్రదానం


సత్కరిస్తున్న తంగెడ కిషన్ రావు, చిత్రంలో తనికెళ్ల భరణి, ముట్నూరి కామేశ్వరరావు

నాంపల్లి: రంగస్థల నటులు, రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో కీర్తి శేషులు చాట్ల శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలను రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నటులు తనికెళ్ల భరణి, కార్యక్రమ కన్వీనర్ ముట్నూరి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి సమర్పణలో అక్కల తామేశ్వరయ్య రచించిన వి.సత్యనారాయణ దర్శకత్వంలో ప్రదర్శించిన బూడిద హాస్య నాటిక ఆకట్టుకుంది.

చాంద్రాయణగుట్టలో ఎంఐఎం కార్యాలయానికి నిప్పు



చాంద్రాయణగుట్ట: ఎంఐఎం పార్టీ కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హాషామాబాద్ ఇంద్రానగర్‌లో స్థానిక మజ్లిస్ నేత షరీఫ్ 12 ఏళ్ల క్రితం ఎంఐఎం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించాడు. మంగళవారం తెల్లవారుజామున కార్యాలయంలో మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు ఆయనకు సమాచారం అందించారు. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. తెల్లవారుజామున 4.09 గంటల సమయంలో మెడలో జాతీయ జెండా ధరించి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ చల్లాడు. ఆ సమయంలో మహిళ పోతుండడంతో.. కాసేపు ఆగాడు. సదరు మహిళ వెళ్లగానే షట్టర్‌పై పోసి నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రాజాసింగ్‌కు అభినందన


రాజాసింగ్‌ను సన్మానిస్తున్న పాతబస్తీ బీజేపీ నేతలు

చార్మినార్: గోషామహల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌ను పాతబస్తీ బీజేపీ నాయకులు ఉమామహేందర్, సురేందర్ తదితరుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీతో పాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేసినప్పటికీ..గోషామహల్ నియోజకవర్గం ఓటర్లు రాజాసింగ్‌కు బ్రహ్మరథం పట్టారన్నారు.

రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు


రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అలీ మస్కతి

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ కాంపేయిన్ అండ్ ప్లానింగ్ (ప్రచారం, ప్రణాళిక) కమిటీ కన్వీనర్ అలీ మస్కతి కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 37 మందిపై కేసులు

బహదూర్‌పురా: బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌లో 37 మంది కేసులు నమోదు చేసి వాహనదారులను నాంపల్లిలోని 9వ ఎంఎం కోర్టులో హాజరుపర్చగా..న్యాయమూర్తి 29 మందికి జరిమానాలు విధించారు. 8 మందికి జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించారు. ఇందులో ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష, జరిమానా, నలుగురికి నాలుగు రోజుల జైలు శిక్ష, జరిమానా, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానాలు విధించినట్లు బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణా కుమార్ తెలిపారు.

లక్ష్య ఛేదనలో ఆరోగ్యం ఎంతో ముఖ్యం


ఎస్కీలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంతోపాటు సమాజానికి సేవ చేయగలరని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారని, దీంతో బీపీ, షుగర్‌లతోపాటు గుండె సంబంధ సమస్యలు వస్తున్నాయన్నారు.శిబిరంలో బీపీ, షు గర్, ఈసీజీ, ఎముక సాంద్రత పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపల్ జగన్మోహన్‌రెడ్డిలతోపాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య సంస్థ కనక దుర్గ నృత్య విభావరి ఆధ్వర్యంలో భారత నాట్య ప్రదర్శన పేరిట మంగళవారం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్య గురువు నిర్మల ప్రభాకర్ నిర్వహణలో 40 మంది చిన్నారులు పలు అంశాలపై చక్కటి హావాభావాలతో చేసిన నృత్యాలు సమ్మోహన పరిచాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి శాస్త్రీయ కళలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత గురువు ఎస్.సువర్ణలత, జి.వెంకట్‌రెడ్డి, కుసుమ భోగరాజు, శ్రీవల్లి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి


ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సత్కరిస్తున్న మార్వాడి సమాజ్ నాయకులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీ హయాంలోనే జరిగిందని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేసినందుకే మరోసారి తనను గెలిపించారన్నారు. మార్వాడి సమాజ్ నాయకులు రాంసా, పలువురు నేతలు నూతన ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం రాజాసింగ్ మాట్లుడుతూ.. గోషామహల్ ప్రజల కోసం, సంక్షేమం కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం


రాజాసింగ్‌కు అభినందనలు తెలుపుతున్న కృష్ణ గుప్తా

అబిడ్స్: ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణ గుప్తా అన్నారు. అన్నివర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎన్నికలు ఉన్నా..లేకున్నా ప్రజల మధ్యనే బీజేపీ ఉందన్నారు. హ్యాట్రిక్ సాధించిన బీజేపీ ఎమ్మెలే రాజాసింగ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం కృష్ణగుప్తా మాట్లాడుతూ.. మోదీ పథకాలను అందరికీ అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు. ప్రజలను పదేళ్లుగా వేధించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సంజీవరెడ్డి ఆదర్శప్రాయుడు



గన్‌ఫౌండ్రీ: డాక్టర్ పీఎల్ సంజీవరెడ్డి ఆదర్శప్రాయుడని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సంజీవరెడ్డి 83వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్ బృందం ఆలపించిన అన్నమాచార్య గీతాలాపన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ మాజీ కమిషనర్ ఎం.నర్సిమప్ప, రసమయి సంస్థ అధ్యక్షుడు ఎంకే.రాము, పైడి సందీప్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

నాంపల్లి: ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలైన ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బజార్‌ఘాట్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హబీబ్‌నగర్‌కు చెందిన గోపాల్ ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి నాంపల్లి ఏరియా ఆస్పత్రి వెనుక వైపు రోడ్డులో వెళ్తున్నాడు. అదే సమయంలో నాంపల్లి ముర్గీ మార్కెట్ రోడ్డు నుంచి గుర్తుతెలియని ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో గోపాల్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు నాంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో...

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో బజార్‌ఘాట్‌లో యాక్టివాపై బర్కత్ అలీని ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. బర్కత్ అలీ తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.